# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## తారాపథం చేరుతున్న శ్రీధర్

### ( *చలనచిత్ర 1974 ఫిబ్రవరి 1* నుంచీ పునర్ముద్రణ)



**పరిశ్రమకు కొత్త** ముఖాలు కావాలనే నినాదం చాలాకాలం నుండి వున్నదే. వింటున్నదే. ఐతే కొత్తవాళ్ళు రావడం లేదా అంటే అసంఖ్యాకంగా వస్తూనే వున్నారు. వారిలో ఎంతమంది నిలబడగలుగుతున్నారంటే అది వేరే విషయం.

ఆ మధ్య విడుదలైన "విశాలి" సినిమా చూస్తూవుంటే ఊర్వశి శారద సరసన హీరోగా నటించిన శ్రీధర్ ఈ చిత్రపరిశ్రమలో కాలూనగలడనిపించింది.

శ్రీధర్ స్వస్థలం కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా కుమ్మమూరు. రైతు కుటుంబంలో పుట్టిన శ్రీధర్ బందరులో ఇంటర్మీడియట్ చదివి హైదరాబాద్ పి.డబ్ల్యు. డి, సెక్రటేరియట్‌లో గుమాస్తాగా పనిచేస్తూ రాత్రి కళాశాలలో చదివి బి.ఎ పట్టా పుచ్చుకున్నారు. ఇది 1964 నాటి కథ,

కడుపులో చల్ల కదలకుండా గవర్నమెంటు ఉద్యోగం చేసుకుంటూ బ్రతుకీడ్చుదామనుకుంటే ఈ కథ మారేది కాదు. ఉత్సాహవంతుడైన శ్రీధర్ అలా అనుకోలేదు కాబట్టే ఆ కథ మరో మలుపు తిరిగి చిత్రసీమకు దారితీసింది.

రాత్రి కళాశాలలో చదువుతున్న రోజుల్లో కాలేజీకి కల్చరల్ సెక్రెటరీ అయినాడు. సెక్రెటేరియట్ గుమాస్తా ఉద్యోగం ఫైళ్ళ మధ్యలోనే నలిపివేయకుండా నాటకరంగానికి పరిచయం చేసింది. ముఖానికి రంగు వేసుకున్నాడు.

పరీక్ష, చీకటి తెరలు, అభాగ్యులు, సాలెగూడు, ప్రగతి, అనుమానం, ఆత్మవంచన, నటసామ్రాట్, ఆకాశరామన్న, సీతారామరాజు, మండేకొండలు మున్నగు నాటకాలలో ముఖ్య భూమికలు పోషించాడు.

ఆంధ్ర నాటక కళాపరిషత్ 1965లో నిర్వహించిన పోటీలలో శ్రీధర్ నటించిన "మంచుతెర" నాటకానికి ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు బహుమతి గెలుచుకున్నది. శ్రీధర్‌కు నాటకరంగంలో పేరూ ప్రతిష్టా సంపాదించి పెట్టింది అల్లూరి సీతారామరాజు నాటకం. దీనిలో సీతారామరాజుగా శ్రీధర్ నటించాడు.

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్రీయ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమం క్రింద ఈ నాటకం కేరళ మైసూరు రాష్ట్రాల్లో 1963 డిసెంబరు నుండీ 1964 జనవరి పదవ తేదీవరకూ నెలా పదిరోజులు ప్రదర్శింపబడింది. ఎర్నాకుళంలో ఆ నాటకం ప్రదర్శిస్తూ వుండగా అక్కడి ప్రవాసాంధ్రులు ముగ్ధులైనారు. శ్రీధర్‌ను నాటకం ముగియగానే మేకప్ కూడా తీయనీయకుండా రంగస్థలం నుండి సరాసరి సన్మాన సభకు తీసుకెళ్ళి అభినందించారు. ఎర్నాకుళం ప్రవాసాంధ్రులు తనకు చేసిన సన్మానం, తనపట్ల ప్రదర్శించిన ప్రేమాదరాలు తానెన్నడు మరచిపోలేనంటాడు శ్రీధర్. తరువాత సీతారామరాజు వేషానికి, రాజమండ్రిలో ఆ నాటక రచయిత శ్రీ పడాల రామారావు, నగర ప్రముఖులు శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు.

ఆంధ్ర ప్రభుత్వ సమాచార శాఖ ఆధ్వర్యాన ప్రదర్శించిన "మండే కొండలు" నాటకంలో హీరో, విలన్ రెండూ కలిసిన ప్రధాన పాత్ర ధరించి ప్రశంసలందుకున్నాడు.

సీతారామరాజు నాటకం చూసిన తరువాత సదరన్ మూవీటోన్ నిర్మాతలు "సతీ అరుంధతి" తీసే కాలంలో శ్రీధర్‌కు మూవీ టెస్ట్ తీసి మూడు సంవత్సరాల అగ్రిమెంటు రాయమన్నారు. కొన్ని కారణాల మూలంగా శ్రీధర్ అందుకు అంగీకరించలేదు.

'అత్తగారు కొత్త కోడలు' నిర్మాత బాబూరావు ఆ చిత్రంలో పరిచయం చేద్దామనే ఉద్దేశ్యంతో శ్రీధర్ స్టిల్స్ హైదరాబాద్ నుండి మద్రాసు తెచ్చారు. తరువాత ఆ నిర్మాతలు కొత్తవాళ్ళను పెట్టుకునే ఉద్దేశ్యం విరమించుకున్నారు. కానీ బాబూరావుగారి భాగస్వామి "హరి"గారి వద్ద శ్రీధర్ స్టిల్స్ వుండగా, అప్పటికి మద్రాసు మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసులో జూనియర్ ఆర్కిటెక్ట్‌గా వున్న శ్రీధర్ సోదరుడు సూరపనేని శేషగిరి రావు ఆ స్టిల్స్ చూసి శ్రీధర్‌ను మద్రాసు సినిమా ఫీల్డ్‌లోకి రమ్మని బలవంతం చేశాడు.

తన సోదరుని బలవంతం మూలంగా శ్రీధర్ 1969 నవంబరులో ఉద్యోగానికి సలాం కొట్టి మద్రాస్ బండెక్కాడు. వచ్చీ రాగానే ఎన్.టి.ఆర్ "తల్లా పెళ్ళామా" చిత్రంలో వేషం కట్టాడు.

ఆ తరువాత శ్రీయుతులు నందమూరి సాంబశివరావు, విఠలాచారి, పింజల సుబ్బారావుగార్ల ప్రోత్సాహంతో 'విజయం మనదే ', 'సి.ఐ.డి, రాజు', 'రౌడీలకు రౌడీ', చిత్రాల్లో ఒక మోస్తరు పాత్రలు వేశాడు. తదనంతరం బి.ఎ. సుబ్బారావుగారు తాను దర్శకత్వం వహించిన లక్ష్మీ కళాచిత్రవారి 'రైతుబిడ్డ 'లో బి.డి.ఓ వేషం యిచ్చి ప్రోత్సహించారు.

ఆ పిమ్మట జగ్గయ్యగారు తమ 'శభాష్ పాపన్న ' చిత్రంలో మెయిన్ విలన్ పాత్ర యిచ్చి ప్రోత్సహించారు. శభాష్ పాపన్న చిత్రం శ్రీధర్‌ను వెలుగులోకి తెచ్చింది.

దేవీ శంకర్ పిక్చర్స్ నిర్మాతలు 'విశాలి'లో శ్రీధర్‌ను ఊర్వశి శారద సరసన హీరోగా నియమించారు. ఈ చిత్రరంగంలో తాను కాలూనడానికి కారకులైన బి.ఎ.సుబ్బారావుగారికీ, జగ్గయ్యగారికీ, దేవీ శంకర్ పిక్చర్స్ నిర్మాతకూ తాను కృతజ్ఞతలు చెప్పుకుంటూ వుంటాడు శ్రీధర్.

ఈనాడు శ్రీధర్ చాలా బిజీ ఆర్టిస్టు. పద్మ బాలాజీ ప్రొడక్షన్, నందిని పిక్చర్స్‌వారి చిత్రాలలో హీరోగానూ, సప్తగిరి ప్రొడక్షన్స్ జీవితాశయం, శ్రీ రామకృష్ణా ఫిలింస్ అభిమానవంతులు, అనంతలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ ప్రేమలూ – పెళ్ళిళ్ళూ, మాధవచిత్ర ప్రొడక్షన్ నెం.4లోనూ, రాజేంద్ర ఆర్ట్స్, ఆర్.ఎస్. కంబైన్స్, ఆర్.సి ప్రొడక్షన్స్ చిత్రాలలో ముఖ్యభూమికలు పోషించిన శ్రీధర్ తెలుగు చలనచిత్ర ప్రపంచంలో ముందుముందు బాగా రాణించగలడనడంలో సందేహమేమీ లేదు.

Post your comments